# అఖిల భారత కార్మికరంగ కార్యకర్తల ప్లీనం

**అఖిల భారత** కార్మిక రంగ కార్యకర్తల ప్లీనం 2024 ఫిబ్రవరి 24,25 తేదీల్లో జరిగింది. కార్మిక వర్గ ఉద్యమం ఎదుర్కొంటున్న రాజకీయ, సంస్థాగత సమస్యలను గురించి, ప్రజాతంత్ర విప్లవానికి నాయకత్వ శక్తిగా కార్మిక వర్గం రూపొందటం గురించి ఈ ప్లీనంలో చర్చించారు. కార్మిక వర్గ ఉద్యమం... సంస్కరణ వాదం, ఆర్థిక వాదాలలో కూరుకుపోయి ఉంది. ప్రజాతంత్ర విప్లవాన్ని విజయవంతం చేసే రాజకీయ శక్తిగా కార్మికోద్యమాన్ని మలచడం గురించి ప్లీనం నొక్కి చెప్పింది. **ట్రేడ్ యూనియన్ రాజకీయాలకు, విప్లవ రాజకీయాలకు నడుమ కార్మికోద్యమం తేడా చూపాల్సిన అవసరాన్ని, కార్మిక వర్గ ఉద్యమాన్ని ఒక రాజకీయ ఉద్యమంగా మలచాల్సిన అవసరాన్ని ప్లీనం నొక్కి చెప్పింది.**

ప్రస్తుత జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులలో సామ్రాజ్యవాద దోపిడీ దురాక్రమణలను వ్యతిరేకించాలని, ప్రపంచ పెట్టుబడిదారులు తమ ఆధిపత్యాన్ని తిరిగి నెలకొల్పుకునేందుకు సృష్టిస్తున్న యుద్ధాలను వ్యతిరేకించాలని ప్లీనం పిలుపునిచ్చింది. ఇజ్రాయిల్ పాలస్తీనాపై సాగిస్తున్న యుద్ధంలో రక్తపుటేరులు పారుతూ, ప్రజలు బాధలు పడుతున్నారని, పాలస్తీనా ప్రజల పోరాటానికి ప్లీనం తన సంఘీభావాన్ని తెలిపింది. నాలుగు లేబర్ కోడ్‌ల విధింపును ప్లీనం ఖండించి, వాటి ఉపసంహరణకు నిరంతరాయ పోరాటం సాగించాలని పిలుపునిచ్చింది. దేశవ్యాప్తంగా, ప్రత్యేకించి పంజాబ్, హర్యానా, పశ్చిమ ఉత్తర్ ప్రదేశ్‌లలో రైతాంగం తమ పంటలకు మద్దతు ధర కల్పించాలని, దానికి చట్టబద్ధత కల్పించాలని సాగిస్తున్న ఉద్యమానికి ప్లీనం తన సంఘీభావాన్ని ప్రకటించింది.

బిజెపి ప్రభుత్వ హిందూ మతతత్వ రాజకీయాలకు, ఛాందసవాద రాజకీయాలకు వ్యతిరేకంగా, దేశంలోని దళారీ పెట్టుబడిదారీ ఉన్నతాధికార వర్గపు దోపిడీ విధానాలకు వ్యతిరేకంగా కార్మిక వర్గం పోరాడాల్సిన అవసరాన్ని ప్లీనం నొక్కి చెప్పింది.

కామ్రేడ్ అరవింద సిన్హా, కామ్రేడ్ విజయకుమార్, కామ్రేడ్ పీకే షాహీ, కామ్రేడ్ గణేష్ పాండా మరియు ఇతర నాయకులు, ప్రజాతంత్ర విప్లవంలో కార్మిక రైతాంగ మైత్రి ప్రాముఖ్యతను గురించి మాట్లాడారు. అలాగే ప్రజాతంత్ర విప్లవాన్ని ఒక నూతన ప్రజాస్వామిక విప్లవంగా అభివృద్ధి చేయాల్సిన దృష్టి కోణాన్ని వివరించారు. వివిధ రాష్ట్రాల నుండి 40 మంది వరకు కామ్రేడ్స్ ఈ ప్లీనం చర్చలలో పాల్గొన్నారు. అంతర్జాతీయ శ్రామిక గీతంతో ప్లీనం ముగిసింది.

*****